# భగవంతం కోసం

**అన్నీ** ప్రయాణేలే. నా జీవితం రైలయిపోయింది. రైలు, బస్సు, కారు, ఒక్క పడవే మిగిలిపోయింది. కళ్లు మండుతున్నాయి. విజయవాడ నుంచీ నిద్రపోదామని. తెరచిన కిటీకిలోంచి కృష్ణాజిల్లా గాలి చొరబడుతూనే ఉంది. అయిదునిమిషాలు నిద్రలోకి జారేసరికి నా పక్కనే ఖమ్మంలో ఎక్కిన దరిద్రుడు ఇంకాస్టేషను దాటకూండానే నిద్ర కప్పుకున్నాడు. తల నా భుజం మీద పారేశాడు. అసలు మధ్యలో చచ్చేడేమో ననుకున్నాను, వాడి తల బరువుగా ఉంది. వాడికి హాయిగానే ఉండి ఉండాలి. ఖమ్మం ఒదిలిన పాతిక కిలోమీటర్ల తరవాత వాడు దరిద్రంగా చొంగ కార్చడం మొదలుపెట్టాడు. స్వెట్టరు తడిపేశాడు. కసిగా భుజంలో తలపైకి నెట్టేను. క్షణంలో మళ్లీ దరిద్రుడి తల దరిద్రపు బరువుతో భుజం మీద పడింది. రైలు చాలా వేగంగా వెళ్తోంది. గాలి శబ్దం రైలు చక్రాల లయ అడ్డుపెట్టుకుని దరిద్రుడి పీక మెల్లిగా నొక్కెయ్యాలని ఆలోచించాను. నా వల్లకాదు. వాడితల కింది నా చెయ్యిలేవదు. ఎడంచేత్తో పీక పిసకడం నాకు సరిగా రాదు. భుజం పూర్తిగా తడిసిపోయింది. ఎదురుగా లావుపాటివాడు వరంగల్లో ఎక్కేడు. ఎక్కగానే సీసాడు నీళ్లు తాగేడు. ఎప్పుడు మొదలు పెట్టేడో తెలీదుగానీ శబ్దానికి ఉలిక్కిపడి లేచేను. హాయిగా వెనక్కి వాలిన కళేబరం. ఒక కాలు ఎత్తి బెంచీ మీద పెట్టేడు. ఆ మహాపిరుదుల లోయలోంచి సుడిగాలిలా గాలి వదులుతున్నాడు. నిద్రో నాకు మెళుకువో తెలీడం లేదు. ఖమ్మం జిల్లాకోసం వాడు లోయబిల్వం తెరిచాడు. రైలు గాలి, బిల్వ శబ్దాలు నాకు ధైర్యాన్నిచ్చేయి. మెల్లిగా శక్తినంతా కూడదీసుకుని నా ఎడంచేత్తో దరిద్రుడి పీక లంకించు కున్నాను. మెత్తగా చెమటతో జారిపోయింది. కానీ బలంగా పీక నొక్కేను. కిక్కురు మనకుండా చచ్చేడు.... భుజం మీద తలబరువుగా వుంది. ఎవరూ చూడకుండా బెజవాడలో దిగిపోడం మంచిది....ఏవో శబ్దాలు. వెలుగులు. "దయచేసి వినండి. హైదరాబాదు నుంచి విశాఖపట్నం వెళ్లే గోదావరి ఎక్స్‌ప్రెస్ నాలుగో ప్లాట్‌ఫారమ్ మీదకు వచ్చియున్నది. యాత్రిగణ్ కృపయా...." విజయవాడలో ఆగి ఉంది రైలు. మరి శవం? భుజం మీద దరిద్రుడు హాయిగా బరువుగా నిద్రపోతున్నాడు. కళ్లు మూసుకున్నాను మళ్లీ.

నిద్రా? మెళకువా? గాలి రైలు హోరు. చీకటిని చీలుస్తూ ఏదో విజిలు. ఒళ్లు తెలికయినట్టయింది. ఏదో బరువు దిగినట్టనిపించింది. చటుక్కున కనెప్పలు తెరుచు కున్నాయి. భుజం మీంచి భూగోళం జారిపోయింది. దరిద్రుడు పక్కన లేదు. కిటికీలోంచి

గాలి కంటి గాయాన్ని రేపుతోంది. ఏదో బ్రిడ్జి దాటుతోంది రైలు. గోదావరి. కిటికీలోంచి చూశాను. తెల్లవెంట్రుకల నల్లజుత్తులో నెరిసి ఉంది గోదావరి అంతా చీకటి నలుపు. ఒచ్చి కూచున్నాను. భగవంతంగారి కోసం ఇద్దంతా. ఎదురుగా పైన స్టూడెంటు కుర్రాడు నా బేగు తలదగ్గిర పెట్టుకుని నిద్రపోతున్నాడు. ఎదుటి లావుపాటివాడు నిద్రలోనే తూర్పు గోదావరి జిల్లా కోసం వాడు లోయ తెరిచాడు. నా కోసం వాడు కుడికాలు మడిచి బెంచీ మీద పెట్టుకుని ఎడం కాలు ముడుచుకున్నాడు. మడిచిన కాలు పిక్క మీదికి పంచెలోంచి వాడి నీటి సంచీ బరువుగా నల్లగా జారింది. గోదావరి దాటింది రైలు.

ఎందుకు భగవంతం నన్నిలా ఏడిపిస్తున్నాడు? నేనే ఏడుస్తున్నా? ఆయన ఉత్తరం పట్టుకుని ఊళ్లు తిరగమని చెప్పేడా భగవంతం? నల్లటి నీటి సంచీని కళ్లలో నింపుకోమని చెప్పేడా? మరి ఆ ఉత్తరాలో? నలిగిపోయి చిరిగిపోయి అన్ని రుతువుల ఆనవాళ్లలో వలసపిట్టలా ఓ కార్డు ముక్క వచ్చి వరండాలో వాల్తుంది. గుంటూరు, విజయవాడ, ఆదిలాబాదు, ఆ బాదు ఈ బాదు–ఆఖరికి ఆ కార్డు పట్టుకుని ఎల్లోరా. కార్డు మీది పోస్టు ముద్రకీ నన్ను రమ్మనే ఊరికీ ఏ మాత్రం సంబంధం ఉండదు. ఓ రోజు రాత్రి గోల్కొండ కమాను కింద నేల మీద కూచుండిపోయి అక్కడే నిద్రపోయాను. మెళకువ వచ్చి చూస్తే తెల్లారింది. వచ్చి వెళ్లిపోయారా?

రైలు పొట్ట విచ్చి విత్తనాల్లా ప్లాట్‌ఫాం మీదికి దొర్లుతున్నారు. ("రాజమండ్రికి స్వాగతం. రాజమండ్రి ఆప్‌కో స్వాగత్....") లేచి ఎదుటి వరంగల్లు వాడి నీటి సంచీని కాలితో ఫుట్‌బాల్‌లా తన్ని దిగిపోదా మనుకున్నాను. రైలు పొట్టలోంచి లుకలుక లాడుతూ బయటపడ్డ వాటిలో ఇరుక్కున్నాను. బ్రిడ్జి మీదికి పాకుతున్నాను. బ్రిడ్జి ఇరుకయిపోయి వెనక నుంచి ఏదో సూట్‌కేసు ముందుకు తోసింది. ముందు మెట్లెక్కుతున్న మార్వాడీ ఆవిడ విశాల వెనక భాగం వల్ల మొహం బద్దలవ్వలేదు.

వేడి టీ తాగి బెంచీ మీద కూచున్నాను. రాత్రి నగరంలోకి ఎలా వెళ్లను? అయినా ఏది పరిచితం గనక? బేగు ఒళ్లో పెట్టుకుని కళ్లు మూసుకున్నాను. కానీ ఇది ఆఖరి ప్రయాణం. ఇంక నేనీ ప్రయాణాలు చెయ్యదల్చుకోలేదు. ఆయన ఏవనుకున్నా సరే. అంతే– అంటా నంతే. మరో కార్డు ముక్క. మరో ప్రయాణం. వెదకడం. పడుకోవడం. రాజమండ్రీలో భగవంతం కోసం నే నొక్కణ్ని దిగేను. కానీ ఎలా? ప్రతీసారీ ఇంతే. ఆఖరనుకుంటాను. మళ్లీ దిక్కుమాలిన రైళ్లూ, రిజర్వేషను దొరక్కపోవడం, ఓ భుజం మీద దరిద్రపు తలకాయ, ఎదురుగా నల్లటినీటిసంచీ... తప్పదు తప్పదు. చెవులు బద్దలై, మెదడు చివదరవందరై పోయి కన్రెప్పలు ఊడి కిందపడ్డాయి. నా గుండెల మీంచి వేగంగా ఖాళీ గూడ్సు రైలు. ఎంతకీ అవదు దడదడ. నాకు భయవేసింది. ప్లాట్‌ఫాం

మీది కెక్కి నన్ను కొండ చిలువలా చుట్ట చంపెయ్యడు గదా... ధడ ధఢ ధడహ... శూన్యాన్ని మోసుకుపోయింది.

వాడెవడో ఒంటరిగా గుడిశలాంటి చివరిపెట్టె చివర పచ్చటార్చితో నుంచున్నాడు. వాచీ చూసుకున్నాను. నాలుగవుతోంది. శబ్దం తరవాత నిశ్శబ్దంగా ఉంది. అవతల ప్లాట్‌ఫాం మీద రెండు కాళ్లూ లేని వాడు మెల్లిగా పెద్ద పురుగులా దేకుతున్నాడు. అతనికి భగవంతం రాయడనుకుంటాను. రాసినా పట్టించుకోడేమో...ఊ...

మధ్యాహ్నమో సాయంత్రమో తెలీదు. నిద్రలో ఉన్నాను. కిటికీ లోంచి ఎవరో చిన్న పిల్ల అరిచింది. భగవంతంగారు నన్ను చిడియా బజారు రమ్మంటున్నారంది. వెంటనే మెళకువ వచ్చింది. గబగబ స్నానం చేసి ఆటోలో చిడియాబజారు కెళ్లేను. పంజరాల్లో అనేక రంగుల్లో పిట్టలు. జనం అటూ ఇటూ తిరుగుతున్నారు. వీధి వీధంతా జనాన్ని తోసుకుంటూ పంజరాల్ని చూస్తూ కలయ తిరిగేను. నేనూ, పంజరాలు, మనుషులూ. ఓ కూల్‌డ్రింకు షాపు మెట్లెక్కి చూశాను. ఎవరూ నా వేపు రావడం లేదు. కొన్ని పిట్టలు కిచకిచ మంటున్నాయి. ఎన్ని అడవులు, చెట్లు పొదలు బోసిపోయాయో. ఏదో బెంగ బొడ్డులోంచి లోపలికి ప్రదేశించింది. పొగ మంచులా గుండె చుట్టూ వరడగుడి కట్టింది. ఓ చివరికి నడిచి మూసిన పాన్ డబ్బా పక్కన కూచుండి పోయాను. పంజరాలు ఊగుతున్నాయి. ఎవడో గడ్డం సాయిబు పెద్ద పంజరాన్ని ఈడుస్తూ నా దగ్గిరికి వచ్చేడు. కళ్లలో కళ్ల పెట్టి నా వేపు చూస్తూ నుంచున్నాడు. కాళ్లు వణుకుతున్నాయి. చటుక్కున వాడు నన్ను ఉండచుట్టి ఒక్క క్షణంలో పంజరంలోకి తోసి తలుపేశాడు. నన్ను వాడు ఊడుస్తూ బయల్దేరేడు. గుండె బద్దలై ఏడుపొచ్చింది. రోడ్డు మీద పంజరంలో వెల్లకిలా పడ్డాను.... బెంచీ మీంచి కిందపడ్డంత పనైంది. పక్కన ఎవరో ఇచ్చి కూచున్నారు. కళ్లు నులుముకుని వాచీ చూసుకున్నాను. అయిదు దాటుతోంది. కాసేపు తటపటాయించి సంచీ తీసుకుని లేచేను. పక్కాయన విశాలంగా జరిగేడు.

"సార్, మీకు భగవంతం తెలుసా?"

ఆయన నావేపు తేరిపార చూశాడు.

"ఆయన ఏం చేస్తుంటారు?"

"కార్డు ముక్కలు రాస్తూంటారు."

"వెళ్లి పడుకోండి."

టికెట్ ఇవ్వడానికి ఇప్పుడు అక్క డెవరూ లేరు. ఆగి గుమ్మం దగ్గిర నా ప్రయాణం గుర్తుగా టికెట్ పడేసి బైట పడ్డాను. బైటికి రాగానే ఖాళీ ఆటో ఈగలు చుట్టుముట్టేయి.

అందులో ఒకటి నా మణికట్టు లంకించుకని లాక్కెళ్లిపోయింది. ("బావుంటదండి లాడ్జి, బలేటోరే...") అయిదు నిముషాల్లో దరిదాపు నిర్జీవంగా ఉన్న రోడ్డు మీంచి బిందువులోంచి సరళరేఖ లాగినట్టు లాగి ఓ సెంటర్లో ఆటో ఆపేడు.

"సార్ ఇదే లాడ్జి. రండి. బేగు నేను తెస్తాను."

రెండంతస్తుల హోటలు. తలెత్తి చూశాను. నల్లటి అక్షరాల్లో 'సంతోషం లాడ్జి'. ఇద్దరం లోపలికెళ్లేం. పాత టేబిలు మీద మాసిపోయిన నీలం గుడ్డ అక్కడక్కడ చిరిగిపోయింది. కుర్చీలో వెనక్కి వాలి మేనేజరు నిద్రపోతున్నాడు. సగం నోరు తెరిచి పెట్టుకుని గురక పెడుతున్నాడు. "చలపతిగారూ" అంటూ డ్రైవరు రెండుసార్లు అరిచేడు. కళ్లు తెరిచి నిద్ర కలిసిన చిరాకుతో చూశాడతను. కళ్లు నులుముకుని ఇద్దర్నీ చూశాడు. రిజిష్టరు నా ముందు పడేసి పేరూ ఊరూ రాయమన్నట్టుగా సంజ్ఞ చేశాడు. డ్రైవరు డబ్బులు తీసుకుని వెళ్లిపోయాడు. పేరూ ఊరూ అయ్యేయి.

"సార్, భగవంతం కోసం అంటే"

"అందుకోసం వచ్చేను"

"అలా రాయకూడదు సార్. బిజినెస్, పర్సనల్ ఏదో ఒకటి రాయండి." అదోలా చూశాడు నా వేపు.

"అది పర్సనల్"

"అయినా, అలా రాయకూడదండీ బాబూ. తెల్లారుతూ ఇదేటండీ?"

"ఈ లాడ్జికి 'సంతోషం' అనెందుకు పెట్టేరు?"

"ఈడకొచ్చినాళ్లందరూ సంతోషంగా ఉండి వెళ్లేరు. ఎళ్లి పడుకోండి. అలిసిపోయినట్టు వస్తున్నారు. రేయ్ సార్ని ఇరవైకి తీసుకెళ్లు." రేయ్ నా వెనక నుంచి ఒచ్చి కిందపెట్టిన నా సంచీ తీసుకుని గబగబ మెట్లెక్కడం మొదలు పెట్టేడు. మెట్లు కొంచెం ఇరుగ్గా ఒంపు తిరిరేయి. వెలుతురుగానూ చీకటిగానూ కూడా లేదు. వరాండా చివర పిట్టగోడ దాని ఇవతలి గది దగ్గిర ఆగి తాళం తీశాడు. నే నింకా మూడు గదుల దూరంలో ఉండగానే నా ఎడంవేపు గది తలుపు తెరుచుకుంది. పౌడరూ మరేదో వాసనా నామీద పడింది. ఎర్ర చీరలో ఒకామె జుట్టు ముడి వేసుకుంటూ నన్ను రాసుకుంటూ మెట్లవేపు వెళ్లిపోయింది. గది తలుపు దభాలున మూసుకుంది. దుప్పటి పరిచి మంచి నీళ్ల కుండా తీసుకుని బయటపడ్డాడు రేయ్.

తలుపు దగ్గిరిగా వేసేను. పెద్ద లైటు తీసి బెడ్‌లైటు వేసుకుని కిటికీ దగ్గిర నుంచున్నాను. హోటలు బయట రోడ్డు ఇంకా సందడిగా లేదు. ఎవరో ఎర్రచీర స్త్రీ

లోపల్నించి ఒచ్చి రిక్షా ఎక్కింది. ఉదయం వెళ్లాలి. భగవంతం కలుస్తాడు. ఎన్ని తంటాలు పడాలో. నాన్నగారు పోయినప్పుడు అస్థికలు కలపడానికి రాజమండ్రి ఒచ్చేను. గోదావరి గట్టున మురికి సత్రంలో తడి లుంగీతో లోపల ఏడుపు తడితో. పూలూ పూజా ద్రవ్యాలూ, బొమికలూ–నాన్నగార్ని పొట్లం కట్టి గోదాట్లో పారేశాను. పక్కనే చాకళ్లు బట్టలు ఉతుకుతున్నారు. చాలామంది స్నానం చేస్తున్నారు. మెట్లకి దగ్గిరిగా అరిటాకులు, పూలు ఇంకా ఏవేవో తేల్తున్నాయి. చాకలమ్మాయి పెద్ద ఎర్ర దుప్పటి ఉతుకుతోంది. నాన్న గార్ని సాధ్యమైనంత దూరంగా విసిరేశాను. ఆయన్ని చేపల తిని ఉంటాయి. చేపల్ని జాలర్లు పట్టుకుని ఉంటారు. రాత్రి చేపల పులుసు వండుకుంటారు. ఎంతమందిలో నాన్నగారు కలిసిపోయి ఉంటారు? ఎంతమంది?

కిటికీ ఒదిలి మంచం మీద కూచున్నాను. రెండ్రోజుల్లో భగవంతం కలుస్తాడు. వెతుకుతాను. అసలు ఆయనేవస్తాడు. మంచం పక్కనే చిన్న టేబిలు. దానికి ఒకటే సొరుగు. టేబిలు వెనక గోడమీద బుద్ధుడి కేలెండరు రంగుల్లో వేలాడుతోంది. సంతోషం లాడ్జిలో బుద్ధుడు. కాసేపు ఆయనవేపు చూస్తూ ఉండిపోయాను. నాన్నగారు, సంతోషం. దుఃఖం, బుద్ధుడు, భగవంతం, టకటక. మళ్లీ టకటక. ఒక్కక్షణం నా గుండె ఆగిపోయింది. లేవలేకపోయాను. లోపలికి రండని కూడా అనలేకపోయాను. తలుపు తోసుకురానే వచ్చారు.

"సార్. మాలిష్ సార్. హాయిగా ఉంటదండి."

బెడ్ లైటు వెలుగులో వారం క్రితం తెల్లగా ఉన్న లాల్చీ ఏదోరంగు పేంటూ ఒంకీల జుత్తూ కళ్లకి సుర్మాల యజమాని నుంచుని నా వేపు ఆశగా చూస్తున్నాడు.

"రమ్మంటారా సార్. బావుంటది సార్."

పొమ్మని చెయ్యి ఊపేను. వాడు బాధగా నా వేపు ఆఖరిసారి చూసి తటపటాయించి వెళ్లిపోయాడు. లేచి గడియ పెట్టి మంచం మీద కూచోబోతూ టేబిలు దగ్గిర ఆగేను. ఓసారి బుద్ధుడి వేపు చూసి సొరుగు లాగేను. రాలేదు. లాగేను. రాలేదు. కాసేపు పడుకోవాలి. వెల్లకిలా వాలి కళ్లు మూసుకున్నాను. చిన్న శబ్దంతో ఫేను తిరుగుతోంది. నన్ను ముక్కలు ముక్కలు చెయ్యడానికి అవస్థపడుతోన్న మూడు రంపాలు. గిరగిరగిర. ముక్కలు ముక్కలు. తడి బట్టల్తో గోదావరి ఒడ్డున నుంచున్నాను. ఏడుపొచ్చింది. ఏడుస్తూ నుంచున్నాను. ఏడుపే ఏడుపు. ఏడుపు నది. నది ఏడుస్తోంది.

ఉదయం పది గంటలయింది. నీలంగా తెల్లగా గోదావరి తళ తళ మెరుస్తోంది. నీలం అంచు వెండి చీర. నాలుగైదు చిన్నా పెద్దా పడవలు ఒడ్డునే స్తబ్దుగా ఉన్నాయి.

నది మధ్యలో ఇసక లంక దగ్గిర మరో పడవ. రామాలయం గట్టు మీద కూచున్నాను. అవతలగాచాకళ్లు అవిశ్రాంతంగా బట్టలుతుకుతున్నారు. వరసగా అరడజను మంది దీక్షతో రాళ్ల మీద బాది బాది ఆడాళ్లనీ మగాళ్లనీ మళ్లీ గోదాట్లో పిండేసి అడ్డంగా మడిచి మెలేసి పిండి పిండి భళ్లుమని దులిపి తాళ్లకి వేలాడదీస్తున్నారు. గడకర్రలకి కట్టిన తాళ్లకి ఊగుతున్నారు వాల్లు. పక్కనే కుప్పగా కొంతమంది పడున్నారు. చప్టా మీద ఎండలో కొందర్ని సాగదీసి పడుకోబెడుతున్నారు. నాకూ తప్పదు. రాయికేసి ఆ నీలం చీర చాకల్ది ఉష్‌రంటూ బాదడం ఖాయం. తప్పదు. భగవంతంగారు ఆరవాలి. వస్తారు. మెరుస్తోన్న గోదావరి వెచ్చగా కళ్లలో తిరిగి నా బుగ్గల మీంచి జారుతోంది. తెల్లచొక్కా గోధుమ రంగు పేంటులోకి తోసిన తెల్లటి వ్యక్తి మెట్లు దిగుతూ నా వేపు ఒస్తున్నాడు. గతుక్కుమన్నాను. నేనుకూచున్న దగ్గిరికి వచ్చి ఒక క్షణం గోదావరిని చూసి ఒంగి బూట్లు విప్పుకుని పేంటు కొంచెం పైకి మడిచి నీళ్లలోకి దిగే డతను. కాళ్లు తడుపుకుని కాసిని నీళ్లున నెత్తి మీద జల్లుకుని మెట్లెక్కి బూట్లు తొడుక్కుని వెళ్లిపోయాడు. నీలం కోకలో చాకలి బలమైన చామనచాయ తొడల సాయంతో తడి మొహంతో నావేపు వస్తోంది. నన్ను లుంగచుట్టి బహుశా ఆ తొడల మధ్య పిండి బాది ఉతికి ఆరేస్తుంది. తప్పించుకునే అవకాశం కూడా ఉన్నట్టు లేదు. చప్టా మీంచి దూకి మెట్లెక్కి వెళ్లిపోయిందామె. నేనామె వీపుని చూస్తూండగా ఒంకీల జుత్తూ లుంగీ, లాల్చీ మెళ్లో తువాలు వాడు మెట్లు దిగుతూ నా వేపు చూశాడు. వాడి కళ్లలో ఆశ, కొంచెం సుర్మా, గుర్తింపు కనిపించాయి. దగ్గిరి కొచ్చి పలకరింపుగా నవ్వేడు. నేనేవీ అనలేదు.

"గోదాట్లో దిగారా?"

తల అడ్డంగా ఊపేను. రెండు మెట్లు దిగి లుంగీ లాల్చీ విప్పి ఆ కుప్ప మీద తువాలు పడేసి నీళ్లలో దిగేడు మాలిషువాడు. గీరల లాగులో పొట్లం కట్టిన సన్న పిర్రలు మెల్లిగా నీళ్లలో కలిసిపోయాయి. ఏదో బెంగ. లోపలంగా బెంగ జిగటతో ఆవకాయ అయి పోయింది. బ్రిడ్జి మీంచి రైలు మక్కలుగా పాకుతోంది. అటు నుంచి నాన్నగారు ఈదుకుంటూ వస్తే బాగుండును. ఎందుకొచ్చే వంటే ఏం చెప్పను? నా వెనక ఆలయం నుంచి కాషాయలుంగీతో మెళ్లో కాషాయ తువాలుతో ఇటీవలే గీయించుకున్న గుండుతో ఒకతను వచ్చి గోదావరి వేపు చూస్తూ నుంచుండిపోయాడు. అప్రయత్నంగా అడిగేను.

"భగవంతంగా రిక్కడికి వస్తూంటారా?"

అప్పుడే నన్ను చూసినట్టు చూశా డతను.

"ఆయ. మీరే ఊరండి."

"హైదరాబాదు. ఇప్పుడొచ్చే అవకాశం ఉందంటారా?"

"ఎవరండీ?"

"భగవంతంగారు."

"ఆయనపేరు భగవంతంగాదు. గురూగారు. ఒచ్చి ఇక్కడే రెండ్రోజులుండి వెళ్లిపోతూంటారు. మొన్ననే ఒచ్చి వెళ్లేరు. మీరాయన గురించి వచ్చేరా?"

"భగవంతంగారి గురించి ఒచ్చేను."

చిరాగ్గా నా వేపు చూశా డతను.

"మీరు హైదరాబాదులో ఏం చేస్తూంటారు?"

"ఏవీ చెయ్యను."

"ఇక్కడికి గురూగార్ని చూడ్డానికి వచ్చేరా?"

"భగవంతంగారి కోసం"

కాషాయ శరీరం వెనక మాలిషువాడు తడిగా గట్టెక్కేడు. తల తుడుచుకుంటూ నా వేపు చూసి నవ్వేడు. కాషాయం నా వేపు ఒళ్లు మండినట్టు చూశాడు.

"సార్ బగవంతం అనే పేరుతో ఇక్క డెవరూ లేరు. మా గురూగారే ఉన్నారు. ఆయన బగవంతం కాదు. ఎవరో గానీ మీకు సరింగా చెప్పలేదు." కాషాయం గుళ్లోకి వెళ్లిపోయింది. గోదావరి ఒడ్డుకు రాకపోతే భగవంతంగారు ఎక్కడి కొస్తారో నాకు తెలుసు. చాలాసేపు కూచుని మళ్లీ సంతోషానికి వెళ్లిపోయాను. నేను గది తలుపు తీస్తుంటే మాలిషువాడు మరో గదిలోంచి బయటికి వస్తూ నన్ను చూసి ప్రేమగా నవ్వేడు. భగవంతంగారి గురించి ఆలోచిస్తూ పడుకున్నాను. నిద్ర పట్టేసింది. కల్లో నేను పరిగెడుతున్నాను. ఎక్కడికో తెలీదు. రైలు స్టేషను కొచ్చేను. ప్లాట్‌ఫాం మీదికి దూకే సరికి రైలు వెళ్లిపోతోంది. మాలిషువాడు కాళ్లు పిసుకుతున్నాడు. బావుంది. ఒక ఇంటి తలుపు మీద భగవంతం అని రాసున్న బోర్డు వేలాడుతోంది. ఖాళీ ఇల్లు.

సాయంకాలం మళ్లీ రామాలయం దగ్గిరికి వెళ్లేను. రంగురంగుల వెల్తురు పరుచుకుంది గోదారి మీద. నేనుదయం కూచున్న చోటే కాషాయం కూచుని ఉన్నాడు. కొబ్బరి ముక్కలు తింటున్నాడు. నన్ను చూసి తలొంచుకుని మరోముక్క కొరికేడు. నీళ్ల దగ్గిర పడవ ఆగి ఉంది. చప్టా మీద ఉతకబడ్డ వాళ్లందర్నీ మడతపెడుతున్నారు. తాళ్లమీంచి లాగి కుప్పగాపడేశారు. నోట్లో బీడీతో కుర్రాడు పడవ ఎక్కేడు. గబగబ వెళ్లి ఆగమని చెయ్యి ఊపేను.

"ఏటండీ?"

"నన్ను పడవలో తీసికెళ్తావా డబ్బులిస్తాను."

"ఇప్పుడేటండి షికార్లు? చీకటి పడతందండి."

"పోన్లే అట్టా కొంతదూరం తీసికెళ్లి తీసుకురా. డబ్బులిస్తాను. ప్లీజ్"

"రండి"

పడవ ఎక్కేను. గడవేసి నది మధ్యకి తోస్తున్నాడు. వెనక్కి తిరిగి చూశాను. తీరం దారం తెగిపోయింది. గట్టుదూరం అయిపోయింది. రామాలయంతో, మాలిషువాడితో, చాకలితో సంబంధం తెగిపోయింది. వీడు లాక్కుపోతున్నాడు. గోదావరి రంగులు కరిగి నల్లబడింది. నేను ఒక్కణ్నే గోదావరిలో ఉన్నాను. బాగా ముందుకు వెళ్లిన తరవాత పడవని పక్కకి తిప్పుతున్నాడు.

"నీకు భగవంతంగారు తెలుసా?"

చీకట్లో వాడి ముఖం కనిపించడం లేదు.

"లాంచీ ఓనరేటండి? ఆరి గురించిగా నొచ్చేరా?"

"భగవంతంగారి గురించి."

వాడు మాట్లాడలేదు మళ్లీ. నల్లటి నది. నా చుట్టూ వాడు దాన్ని తెల్లగా కలవరపెడుతున్నాడు. తీరం జిగేల్మంటోందిపుడు. చల్లటి గాలి మిగిలిన నా జుత్తునీ చొక్కా కాలర్నీ రేపుతోంది. శరీరం హాయిగా చల్లబడింది. కానీ లోపల ఆందోళన అలజడి చల్లబడలేదు. కళ్లు మూసుకున్నాను. నీటి బుగ్గ మీద తెడ్డు ఛళ్లుమనడం తెలుస్తోంది. నేనెప్పుడే ఇంత ఒంటరితనంలో లేదు. ఈ కారు నలుపు నదిలో తూగుతూ.... నిద్ర వంటి మెలకువ వంటి నిద్ర వంటి..... చిన్న కుదుపు.

"దిగండి."

పడవవాడికి డబ్బు లిచ్చేను. పడవ గేదెని లాగి రాటకి కడుతున్నాడు. నాకు టైమయిపోతోంది. బయటికొచ్చి ఆటో ఎక్కి కూచున్నాను. నగరాన్ని చీల్చుకుంటూ అరుచుకుంటూ ఊరు బయట ఒదిలింది నన్ను. పొడవాటి నిర్జనంగా ఉన్న రోడ్డు. చచ్చిన కొండచిలువలా. రోడ్డుకి ఒక పక్క అవతలగాపెద్ద సైజు బడ్డీకొట్టు. ముందు కూరగాయలు వెనక సిగరెట్లు, చాక్లెట్లు. కొట్టు పక్క చీకట్లో ఎవరో స్కూటరు మీద కూచున్నాడు. సరిగ్గా కనిపించకపోయినా, అతని ఎదురుగా మరో వ్యక్తి నుంచున్నాడు. కొట్టు ముందు బెంచీ మీద కూచుంటే స్పష్టం కనిపిస్తాను. రోడ్డు దాటి కొట్టు వేపువెళ్లేను.

చల్లటి గాలి వీస్తోంది. కొట్టు వెనక ఇళ్లు లేవు. బెంచీ మీద కూచుని మెల్లిగా కూల్‌డ్రింకు తాగేను. కొట్టు యజమానురాలు చాలా సంతోషించింది. కొట్టులాగే ఆమె కూడా సమృద్ధిగా ఉంది. అప్పుడు తీరిగ్గా చూశాను. సరిగ్గా వచ్చేను. రోడ్డవతల వీధులన్నా జనసంచారం తక్కువ. చిల్లర ఇస్తూ "సిగరెట్టుగాని ఇమ్మంటారా?" అందామె. ఒద్దన్నాను. చిల్లర జేబులో పడేసుకుంటూ అడిగేను.

"కూరగాయలు ఈ ఊరివేనా?"

"ఈ ఊరియ్యేనండి. నాణ్యంగా ఉంటేనే ఏయించుకుంటానండి. ఈడ చాలామంది నా దగ్గిరే పట్టుకెళ్తా ఉంటారండి. బీరకాయలు బాగున్నాయండి ఇమ్మంటారా?"

"ఇప్పుడొద్దు... ఇక్కడికి భగవంతంగారొస్తూంటారా?"

"ఎవరండీ? బేమర్లా?"

"తెలీదు. భగవంతంగారు."

ఆమె రెండు క్షణాలపాటు ఆలోచించింది.

"ఆ... అవునండి. ఒస్తా ఉంటారండి బేరవాదరండి."

"ఇప్పుడొస్తారా? నిన్నొచ్చారా?"

"ఆయ నెక్కడుంటారు?"

"ఇల్లు తెల్దండి."

"కాదు. జ్ఞాపకం తెచ్చుకో. మర్చిపోయి ఉంటావు. ఎట్నుంచి వస్తారాయన? ఒక్కసారైనా చెప్పి ఉంటారు. ఇక్కడే ఎక్కడో....గుర్తు చేసుకో ప్లీజ్."

ఒక జీవితకాలం ఆలోచించిందామె.

"ఇప్పుడీ కుడేపు గారుందాండి, అటేపు నుంచే ఒస్తారండి. కుడేపు రోడ్డులో ముందుకెల్తే ఇల్లున్నాయండి"

ఒక్క ఉదుటున లేచేను. కూరల కొట్టుకి పదిహేను అడుగుల దూరంలో మట్టిరోడ్డు కనిపించింది. అటూ ఇటూ గడ్డీ పిచ్చి మొక్కలూ, పొదలూ, పూర్వం ఏదో పుంత అయి ఉంటుంది. దారి చివర కనిపించినంత వరకూ శూన్యం. కొంచెం దూరం నడిచేను. మట్టి రోడ్డు ఒంపు తిరిగింది. మిగిలి ఉన్న ఏదో తోపు. ఆ వెనకాల ఎక్కడో ఇళ్లు ఉండి ఉండాలి. వాచీచూసుకున్నాను. టైము సరిగ్గా కనిపించడం లేదు. చల్లటిగాలి. ఈ గ్రహం మీద నేనొక్కణ్ని. ఈ పిచ్చిచెట్లూ, ముళ్ల పొదలూ, ఓ పక్క ముద్దలా కనిపిస్తున్న నల్లతోపూ. నేను విడిపోయి పడ్డానిక్కడ. చీకటి చల్లటి నల్లగాలిలో అలాగే నుంచుండి పోయాను.

రాత్రి నిద్ర పట్టలేదు. మామూలుగా రాత్రి పది దాటుతూండగా మాలిషువాడు ప్రయత్నం చేశాడు. నాకు నిద్రో మెళుకువో తెలీని స్థితి. ఇల్లంతా చెమట పట్టేసింది.

మర్నాడు సాయంత్రం మళ్లీ ఆటో ఎక్కి కూచున్నాను. హోటలు గుమ్మంలో మాలీషువాడు ఒంకీల జుత్తు దువ్వుకుంటున్నాడు. జనం మధ్యనుంచి పసుపు పచ్చ గీత గీసుకుంటూ ఆటో ఊరవతల ఆగింది. ఆటోలోంచి గెంతి కూరలావిడ్ని అడిగేను.

"అమ్మా భగవంతంగారొచ్చేరా?"

"ఆయ నెవరండీ?"

"అదే..... నిన్న అడిగేను ఒకాయన్ని.... భగవంతంగారు...."

"ఆ... అవునండి. వచ్చెల్లి పోయారండి."

"అప్పుడే...ఆ! బాగా జ్ఞాపకం చేసుకో."

"ఏం పేరన్నా రండీ?"

"భగవంతంగారు. భగవంతం."

"అయిబాబోయి. ఆయన్దాపేరు గాదండి. బేమర్లు గాదండి. ఆయన పేరు బూషణం గారండి. నే చెప్పినకాడే. ఉంటారండి. మీ రెవరో అడిగేరని కూడా చెప్పేనండి."

బెంచీ మీద కూచుండి పోయాను. ఆమె కోసం డ్రింకు తాగి, సిగరెట్ వెలిగించాను. చటుక్కున చీకటి పడిపోయింది. నేనులేచేను. మళ్లీ పుంతదారిలోకి మళ్లీ బాగా ముందుకు నడిచేను. గాలి బాగా వీస్తోంది. నా చుట్టూ చిత్రమైన చల్లటి నిశ్శబ్దం. మట్టి దారిలో నా చెప్పుల శబ్దం తప్ప. ఇంకా ముందు కెళ్లేను. దారి సన్నబడి ఒంపు తిరిగింది. ఒంపు నానుకుని ఒక పక్కకి జీడిమామిడి తోపు. అలాగే నిలబడిపోయాను. గాలికి చెట్ల కొమ్మలు ఊగుతున్నాయి. వాటి చీకట్లోకి చూస్తూండిపోయాను. గాలికి గట్టిగా ఊగినప్పుడల్లా కొమ్మల మధ్యనుంచి దూరంగా దీపం కనిపిస్తోంది. ఒకసారి కనిపించిమళ్లీ కనిపించడం లేదు. నే నలాగే నుంచుండి పోయాను.

ఆ నిశ్శబ్దం లోంచి గాలి పాటలాంటిదేదో మోసుకొచ్చింది. చుట్టూరా చూసినా ఎవరూ కనిపించలేదు. గాలి గొంతు విని ఉలిక్కిపడ్డాను మొదట. ఓ నిముషం తరవాతమళ్లీ గొంతు వినిపించింది. మళ్లీ గొంతు వినిపించింది. ఎవరిదో కుర్రాడి గొంతులా ఉంది. మాటలు తెలీడం లేదుగానీ అరుపులా ఉందది. వినిపించినవేపు నడిచేను. దారి పక్క తుప్పల వెనక నుంచి ఇప్పుడు పాట వినబడుతోంది. చటుక్కున పాట ఆగిపోయింది.

"పడిపోద్దండి"

మళ్లీ గతుక్కుమన్నాను. చీకట్లో చూసుకోలేదు. నేను నుంచున్న పక్కగా మొక్కల మధ్య సత్తు గిన్నె కనిపించింది. గిన్నె యజమాని దాని వెనక గొంతుక్కూచుని ఉన్నాడు.

"ఎవర్రా నువ్వు?"

"మీ కెందుకండి, ఎల్లండి. దొడ్లో కెల్తున్నాను."

"మీ ఇల్లెక్కడ?"

"తోట్లో ఉంటావండి."

"ఊ. అక్కడ ఆ ఇళ్లకి వెళ్తూంటావా?"

"పాలు పోస్తావండి. మీ రెల్లండి బాబూ."

"రేయి. భగవంతంగారున్నారా అక్కడ?"

"ఆల్లెవరూ లేరండి బాబూ."

"లక్ష్మీకొడకా చెప్తావా చెంబు తన్నెయ్యమంటావా?"

"అయి బాబోయి అయబాబోయి. ఎవరండీ బాబూ మీరు?"

అంటూనే వాడు ఒక్క ఉదుటున ఒంగునే గిన్నె తీసుకుని వెనక్కి పరిగెట్టేడు.

నేను రోడ్డు మీదికొచ్చేను. ఆటో గోదావరి గట్టు దగ్గిర విసిరేసింది. రామాలయం దగ్గిరికి మెట్ల మీంచి గెంతుతూ వెళ్లేను. మెట్లు నన్ను దాటి గోదార్లోకి జారిపోతున్నాయి. రేపు శూన్యంగా ఉంది. ఎంతసేపు నుంచున్నానో. ఎప్పుడో కాళ్లీడ్చుకుంటూ సంతోషానికి వెళ్లేను.

గది తలుపు తీసుకుని మంచం మీద చీకట్లో కూచుండి పోయాను. గ్లాసెడు మంచినీళ్లు తాగి మంచం చివరికి జరిగి టేబిలు సొరుగు లాగేను. నాలుగోసారి దరిదాపు ఊడి నాచేతికొచ్చింది. లోపల వస్తువులేవో తటతటల్లాడేయి. చేత్తో తడిమి బైటికి తీశాను. ఖాళీ అగ్గిపెట్టె, సగం కాలిన కొవ్వొత్తీ.

త్రిపురగారికి.

ఈ కథ ఆయన రచనకి కొనసాగింపు,

వివరణ, అనుకరణ కాదు. ఆయనకి కృతజ్ఞతలు.

❖ ❖ ❖